క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో మంగళవారం దివంగత నేత డాక్టర్. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహిస్తునట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. హాలహర్వి గ్రామంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు వర్ధంతి కార్యక్రమం జరుపుతున్నట్లు వివరించారు. అలాగే ధర్మపురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.

పాత పెన్షన్ విధానమే ఉత్తమం

ఆదోని సెంట్రల్: పాత పెన్షన్ విధానమే ఉత్తమమని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య పట్టణ శాఖ అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌నకు వ్యతిరేకంగా సోమవారం పురపాలక ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాల విరామ సమయంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సామాజిక పెన్షన్ కంటే తక్కువగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, ఏపీఎంటీఎఫ్ నాయకులు సురేష్ కుమార్, కోటన్న, చంద్రమౌళి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లాగా చేయాలి

ఆదోని సెంట్రల్: ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరారు. సోమవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడును కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎంతో వెనుకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్ ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. నిత్యము కరువు, వలసలకు నిలయంగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, రవి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఆదోని టౌన్: క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని, క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకు న్‌బాను అన్నారు. సోమవారం ఆదోని పట్టణంలోని హనుమాన్ నగర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం తదితర లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు బాబురాజు, సుబ్బమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సు నడపండి

ఆదోని సెంట్రల్: మండల పరిధిలోని పెద్ద హరివాణం, సంతేకూడ్లూరు గ్రామాలకు సమయానికి విద్యార్థి బస్సు నడపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌టీసీ డిపో ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ మల్లికార్జునను కలసి వినతిపత్రం సమర్పించారు.

ఖోఖోలో కోసిగి విద్యార్థుల ప్రతిభ



సాధించిన కప్, క్రీడకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కోసిగి: జాతీయ స్థాయి క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి ఖోఖో పోటీలలో కోసిగి బాలుర ఉన్నత పాఠశాల క్రీడకారులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో ప్రార్థన అనంతరం గెలుపొందిన క్రీడకారులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో 19 పాఠశాలల జట్లు ఖోఖో పోటీలలో పాల్గొనగా కోసిగి జట్టు విజేతగా గెలుపొందడం హర్షనీయమన్నారు. క్రీడకారులను ప్రోత్సహించిన పీడీ ఖలీల్ అహ్మద్ కు అభినందించారు. పాఠశాల పీడీ రాజారామ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నందవరం : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహాదేవి సూచించారు. సోమవారం మండల పరిధిలోని గంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి పౌష్టికాహారం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలే!



రోడ్డులో ఇరుక్కున టిప్పర్, పాఠశాల బస్సు

కౌతాళం: ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి పాదచారులు సైతం నడవలేని స్థితిలో ఉన్నాయి. మండల పరిధిలోని హాల్వి నుంచి కోసిగి గ్రామానికి వెళ్లే రోడ్డుపై రెండు నుంచి మూడు అడుగుల గుంతలు పడి చినుక పడితే చిత్తడి మారి బురద, వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. మండలంలోని హాల్వి గ్రామంతో పాటు వల్లూరు, గుడికంబాలి, మరళి, గొతులదొడ్డి, కుంబళనూరు గ్రామం, క్యాంపు–1, క్యాంపు–2, నదిచాగి, మేళిగనూరు, కాత్రికి గ్రామాల ప్రజలు ఈ రోడ్డులోనే కోసిగికి, మంత్రాలయం, ఎమ్మిగనూరు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డులోనే కోసిగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు వివిధ కార్యాలయాలు ఉన్నాయి. ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. హాల్వి నుంచి అర్లబండ వరకు ఉన్న నాల్గు కిలోమీటర్ల రోడ్డు మరి దారుణంగా తయారైంది. రోడ్డులో గుంతలు మడుగులా కనిపిస్తున్నాయి. ఇటీవల కోసిగి ప్రవేట్ పాఠశాల బస్సు, టిప్పర్‌లు గుంతల్లో ఇరుక్కుని పోవడంతో పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు నాన అవస్థలు పడ్డారు. చివరికు జేసీబీ వచ్చి ఈ రెండు వాహనాలను లాగి బయటకు తీయాల్సి వచ్చింది.

చిత్తడిగా రహదారి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని మారెమ్మగుడి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు పోవు రస్తా చిత్తడి మారిపోయింది. పాదచారులు సైతం నడవలేని పరిస్థితి నెలకుంది. ఈ దారి గుండానే కౌతాళం నుంచి బదినేహాల్, ఉప్పరహాల్‌కు గ్రామాలకు వెళ్లే రస్తా కావడంతో పాటు రైతులు నిత్యం తమ పొలాలకు వెళ్తుంటారు. ఎప్పుడు రద్దీగా ఉండే రస్తాకు కనీసం గ్రావెల్ కూడా వేయలేక పోతున్నది ఈ కూటమి ప్రభుత్వమని ప్రజలు విమర్శిస్తున్నారు.



మారెమ్మ గుడి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే దారి



హాల్వి- కోసిగి రోడ్డు పొడవునా ఇలాంటి గుంతలే

కోతకు గురైన రోడ్డు



వాన నీటి ధాటికి కోతకు గురైన సూగూరు రోడ్డు

మంత్రాలయం రూరల్ : ఇటీవల కురిసిన వానలకు రహదారులు ఛిద్రమవుతున్నాయి. గుంతల మయంగా మారి రాకపోకలకు యా తన చూపెడుతున్నాయి. కాగా కొన్ని దారు లు కోతలకు గురై ప్రమాదకరంగా మారా యి. మండలంలోని కల్లుదేవకుంట–సూగూరు రోడ్డు ఇటీవల కురిసిన వానకు కోతకు గురైంది. మట్టితో పాటు బీటీ రోడ్డు కొంత భాగం కోత పడింది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ప్రమాదపు అంచున రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

పెద్దకడబూరు : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు అంజనేయ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉల్లి క్వింటా రూ.1200లకు కొనుగోలు చేయాలని చెప్పడం ఉల్లి రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఎకర ఉల్లిపంట సాగు చేయడానికి రూ. లక్షకు పైగా ఖర్చుచేసి అప్పుల పాలు అయిన రైతులకు కనీస మద్దతు ధర రూ. 3వేలు అయినా ఇవ్వాలన్నారు.

ఉల్లికి రూ.3వేలు ధర ఇవ్వండి

కౌతాళం: ఉల్లి క్వింటా రూ.3వేల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఎకరాకు రూ50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండు చేస్తూ ఆదోని సబ్ కలెక్టర్‌కు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మల్లయ్య తదితరులు సంఘం నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

గోనెగండ్ల : ఉల్లి పంటకు కనీస మద్దతు ధర క్వింటాం రూ.3వేలు ప్రకటించాలని కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాసీం వలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మండల కేంద్రం గోనెగండ్లలో ఉల్లి పంటలను పరిశీలించి మాట్లాడారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించకపోతే ఆత్మహత్యలే శరణ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఉల్లిపంట సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడంతో అప్పుల పాలవుతున్న ఉల్లి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమయ్యేలా వుందని ఏపీ రైతు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. ఉల్లిపంటకు కనీస మద్దతు ధర రూ.3వేలు కల్పించి ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏపీకెఎంఎస్) ఆధ్వర్యంలో రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి పత్రాన్ని డిప్యుటీ తహశీల్దార్ వీరభద్ర గౌడ్‌కు ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి రైతులు ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్‌కు వెళ్లి మెడలకు ఉరి తాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగన్న, రైతు సంఘ నాయకులు కెసి జబ్బార్, మాలిక్, శాంతప్ప, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న రైతులు

ఆదోని రూరల్: ఉల్లి పంటకు ప్రభుత్వం రూ.3 వేలు గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బసాపురం గోపాల్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, భాస్కర్‌యాదవ్, సీపీఐ పట్టణ మండల కార్యదర్శులు వీరేష్, కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అలాగే ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఉపాధ్యక్షులు మల్లయ్య తదితరులు సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు.

కానిస్టేబుల్‌పై దాడి

ఆదోని అర్బన్: మండల పరిధిలోని పెసలబండ గ్రామంలో కానిస్టేబుల్‌పై దాడి జరిగింది తాలూకా సీఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు... పెసల బండ గ్రామంలో సోమవారం గణేష్ నిమజ్జనోత్సవం చేపట్టారు. ఊరేగింపు సమయంలో నచ్చిన సినిమా పాట కోసం ఇరువర్గాల మధ్య గొడవ తలెత్తింది. బందోబస్తు విధులకు వెళ్లిన ఇస్వీ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ షేక్ సాబ్ వారిని సర్దిచెబుతుండగా సూరి అనే ఓ వ్యక్తి కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత పోలీసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

4న దరఖాస్తుల పరిశీలన

కౌతాళం: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి నూతన పాలక మండలి ఏర్పాటు కొరకు ఇటీవల దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 4న దేవాలయ కార్యాలయంలో జరుగు దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ పరిశీలనకు వచ్చే అభ్యర్థులు ఆధార్‌కార్డు, పోలీస్‌స్టేషన్ నుంచి ఎన్ఓసీ, విద్యా అర్హత పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, కోర్టు నుంచి అఫిడవిట్‌లు ఒరిజినల్స్ తీసుకుని రావాలన్నారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

నందవరం : రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్స్ డే సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి శాంతప్ప పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన సర్కార్

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలిచ్చిన రాష్ట్రంలోని కూటమి సర్కార్, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్‌లు ఆరోపించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో యువజన సంఘ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరిపించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘ నాయకులు పాల్గొన్నారు.

10న చాకలి ఐలమ్మ వర్ధంతి సభ

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 10వ తేదీన చాకలి ఐలమ్మ, రామకృష్ణల వర్ధంతి సభను పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి గురుశేఖర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఆదోని డివిజన్ రజక వృత్తిదారుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సి.ఈరన్న, రామన్న, ఉరుకుంద పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు మంగళవారం సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తులు కళాశాలలో ఇవ్వాలని ప్రిన్సిపా ల్ విజయరాణి తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. బుధవా రం ఉదయం 10గంటలకు డెమో ఉంటుందన్నారు.

ప్రజలను మోసం చేసిన బాబు

ఎమ్మిగనూరుటౌన్: ఓట్ల కోసం ప్రజలను సూపర్ సిక్స్ పేరిట మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఇచ్చిన హామీలను అమలు చేయక సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను మోసగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, 12వ వార్డు ఇన్‌చార్జ్ షాబుద్దీన్, ముస్లిం మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాశింబేగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగనన్న ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లోని నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు ముల్లా రసూల్, కార్యదర్శి అల్తాఫ్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు బజారిరెడ్డి, కోటకొండ నరసింహులు, వార్డ్ ఇన్‌చార్జ్‌లు చంద్ర, బోయసోమేష్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరిస్తున్న పార్టీ నాయకులు

వివాహిత ఆత్మహత్య

అనంతపురం: ప్రేమించి.. మతాంతర వివాహం చేసుకున్న యువతి.. భర్త వేధింపులు తాళలేక అర్ధంతరంగా తనువు చాలించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని చాకలి వీధిలో నివాసముంటున్న చాకలి అయ్యప్పకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె సవిత (24)కు ఐదేళ్ల క్రితం అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి ఫోన్‌లో పరిచయమయ్యాడు. డ్రైవింగ్‌తో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిన సవిత దస్తగిరిని పెళ్లి చేసుకుంది. అనంతరం తన పేరును దూదేకుల రేష్మాగా మార్చుకుంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఏడాదిగా అనంతపురం నగరంలో కాపురం ఉంటున్నారు. అయితే సవితతో పెళ్లి ఇష్టం లేని దస్తగిరితో పాటు అతని తల్లి ఇమామ్‌బీ, అక్క నూర్జహాన్ తరచూ వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. «నువ్వు చచ్చిపోతే.. మా కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాం» అంటూ శారీరకంగా, మానసికంగా వేధించేవారు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో దస్తగిరి తరచూ సవితపై భౌతిక దాడులకు పాల్పడేవాడు. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో గత నెల 31న రాత్రి 9 గంటల సమయంలో సవిత విషపూరిత ద్రావకం తాగింది. విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు దస్తగిరి ఫోన్ చేసి తెలిపి, అనంతపురంలోని జీజీహెచ్‌లో చేర్పించినట్లు వివరించాడు. దీంతో సవిత కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. అయితే కోలుకోలేక సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని కుడా టౌన్ ప్లానింగ్ అధికారి విజయ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఉప్పర ఫంక్షన్ హాల్‌లో అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గతంలో వున్న లేఅవుట్స్ నిబంధనలను ప్రస్తుతం సడలించడం జరిగిందన్నారు. లే అవుట్స్‌లో 30 అడుగుల రోడ్లకు అనుమతులిస్తున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ కింద ప్లాట్లు కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే వారికి ఓపెన్ స్పేస్ చార్జ్‌లో 50శాతం రాయితీ కల్పిస్తామని, దీంతో 7శాతం మాత్రమే చెల్లించాల్సి వుంటుందని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోకపోతే ఇచ్చిన గడువు తీరిన తరువాత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో 22 ఏ కింద నిషేధిత భూముల రిజిస్టర్ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. క్రమబద్ధీకరణ చేసుకోకపోతే చర్యలు తీసుకోవడంతో పాటు భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని చెప్పారు. నాన్ లేఅవుట్ ప్లాట్లు కొన్న యజమానులు తప్పనిసరిగా ఈఎల్ఆర్ఎస్ 2025 ను సద్వినియోగం చేసుకొని క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీఓ రాజేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుడా టౌన్‌ప్లానింగ్ అధికారి విజయభాస్కర్

జెడ్పీ పాఠశాలలో చోరీ

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని జెడ్పీ పాఠశాలలో చోరీ జరిగినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. పాఠశాలకు శనివారం తాళం వేసుకుని వెళ్లి.. సోమవారం ఉదయం వచ్చి చూడగా తాళలు పగలగొట్టి ఉన్నాయి. పాఠశాల ల్యాబ్‌లో రూ.60వేల విలువైన సామగ్రిని దొంగలించుకుని వెళ్లారని, అలాగే రూ.30వేల విలువైన వస్తువులను నాశనం చేసినట్లు గుర్తించారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి అన్ని కోణాల నుంచి పరిశీలించినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు వైరల్ జ్వరాలు వేధిస్తుండటంతో సోమవారం డాక్టర్ సాయికిరణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా విద్యాలయంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు సర్వసాధారణంగా వస్తాయన్నారు. విద్యాలయంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని, ఇద్దరికి జ్వరం ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వాసుపత్రిలో అడ్మిట్ కావాలని సూచించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, డీఎల్‌పీఓ తిమ్మక్క, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రజాసమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

తహసీల్దార్, ఎస్ఐను సస్పెండ్ చేయాలి

ఆదోని రూరల్/పెద్దకడబూరు: రైతులపై అక్రమ కేసులు బనాయిస్తున్న పెద్దకడబూరు తహసీల్దార్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్, సుదర్శన్, సీపీఐ ఆదోని పట్టణ కార్యదర్శి వీరేష్, కల్లుబావి రాజు, రైతు సంఘం ఆదోని ఉపాధ్యక్షులు గోపాల్ డిమాండ్ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సర్వే నెంబర్లు 177/1, 174/3, 177/3, 177/3ఏ, 177/3బి, 177/4లలో భూమిపై గత 4సంవత్సరాలుగా కేసు నడుస్తుందన్నారు. గతంలో పని చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు ఆ సర్వే నెంబర్లపై 145సెక్షన్ విధించారన్నారు. అప్పటి నుంచి నిబంధనలు పాటిస్తున్న పేద రైతుల పైన, సీపీఐ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. ఎస్ఐ ఎలాంటి విచారణ చేయకుండానే తహసీల్దారు మాటలు నమ్మి 20మందిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంత్రాలయం రూరల్ : మండలంలోని మాలపల్లిలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న తిక్కన్న గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన మృతికి నివాళి ఘటించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు గ్రామ సర్పంచు సీతారామిరెడ్డి, ఉప సర్పంచు భీరప్ప తదితరులు ఉన్నారు.



మృతదేహంపై పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

మంత్రాలయం : మండలంలోని చెట్నిహళ్లి గ్రామం డబ్బాల ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన తాయన్న కుమారుడు అంజి, ఆకుల నరసింహమప్ప కుమారుడు మాధవరం గ్రామం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మంత్రాలయం నుంచి వేగంగా వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రాఘవేంద్ర కాలు, చేయి విరిగిపోగా, అంజి కాలికి బలమైన గాయమైంది. విషయం తెలియగానే ఎస్ఐ శివాంజల్, మంత్రాలయం సర్పంచు తెల్లబండ్ల భీమయ్య సంఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఇరువురిని కర్నూలు పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. కాగా కర్ణాటక వైపు వెళ్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.

అర్హత కోల్పోయిన అభ్యర్థికి న్యాయం చేస్తాం

సాక్షి ఎఫెక్ట్

ఎమ్మిగనూరుటౌన్: తన పేరుతో ఉన్న మరో అభ్యర్థికి తన నేషనల్ స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఇవ్వడంతో డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుకు అర్హత కోల్పోయిన ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గొల్ల రామాంజినేయులుకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని డీఈఓ శామ్యుల్ పాల్ తెలిపారు. 'డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు' అన్న శీర్షికన సోమవారం 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో డీఈఓ స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాధిత డీఎస్సీ అభ్యర్థిని డీఈఓ కార్యాలయానికి పిలిపించి విచారించారు. సర్టిఫికెట్ అక్రమంగా పొంది వక్రమారంలో ఉద్యోగానికి అర్హత సాధించిన జి.రామాంజినేయులుపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తామని డీఈఓ హామీ ఇచ్చారని బాధిత అభ్యర్థి గొల్ల రామాంజినేయులు తెలిపారు.